ఫార్మానా.. బయోటెక్నాలజీనా?

ఎమ్మెస్సీ మైక్రోబయాలజీ చదువుతున్నాను. ఈ కోర్సుతో ఫార్మా, బయోటెక్నాలజీ రంగాల్లో ఉద్యోగావకాశాలు ఎలా ఉంటాయి? ఈ రెండు రంగాల్లో దేన్ని ఎంచుకుంటే మంచిది?

- ఎ.సాయిపవన్

■ మైక్రో బయాలజీ ప్రోగ్రాంలో సూక్ష్మ జీవుల గురించి విపులంగా చదువుతారు. ఫంగీ, బ్యాక్టీరియా, వైరస్, ప్రోటోజోవా, ఆల్గే లాంటివి. మైక్రో బయాలజీలో వైరాలజీ, బ్యాక్టీరియాలజీ, మైకాలజీ, ప్రోటోజువాలజీ, పారాసైటాలజీ లాంటి స్పెషలైజేషన్‌లు ఉంటాయి. మీరు ఎమ్మెస్సీ మైక్రోబయాలజీలో చదివిన స్పెషలైజేషన్ ఆధారంగా ఏ రంగంలో ఉద్యోగాలు ఎక్కువగా ఉన్నాయో తెలుసుకొని, అవసరమైన నైపుణ్యాలు పెంచుకోండి. మైక్రోబయాలజీ చదివినవారికి ఫార్మా, బయోటెక్నాలజీ రంగాలతో పాటు ఫుడ్ ప్రాసెసింగ్, హెల్త్ కేర్, బయోమెడికల్ రంగాల్లోనూ ఉద్యోగావకాశాలు ఉన్నాయి. ఫార్మా, బయోటెక్.. రెండు రంగాల్లో మైక్రో బయాలజిస్ట్‌గా ఉద్యోగం పొందవచ్చు. ప్రస్తుతం ఫార్మా, బయోటెక్ పరిశ్రమలు రెండూ హెల్త్‌కేర్ రంగంతో పాటు దీటుగా అభివృద్ధి చెందుతున్నాయి. మీ ఆసక్తిని బట్టి దేనిలో స్థిరపడాలో నిర్ణయించుకొని ఆ రంగాన్ని ఎంచుకోండి.

- ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

ఏది ముందు.. ఏది తర్వాత?

పనుల్లో ప్రాధమ్యాలను గుర్తించడం చాలా విధాల మేలు చేస్తుంది. ఇది మనకు సంబంధించిన అన్ని అంశాల్లోనూ సక్రమపద్ధతిలో ఉండటానికి దోహదపడుతుంది. నిరంతరంగా జరిగే అభివృద్ధినీ, లక్ష్యసాధనలో ప్రదర్శననూ తరచూ పరిశీలించుకునే వీలు కలుగుతుంది. రోజూ దొరికే సమయాన్ని సద్వినియోగం చేసుకుంటున్నామో లేదో తెలుసుకునే వీలుంటుంది. ఇంకా దాన్ని బాగా ఉపయోగించుకునేలా ఎలా ప్రణాళిక రచించుకోవాలో తెలుస్తుంది. ప్రాధమ్యాలు ఏర్పరుచుకోవడం ద్వారా మన సామర్థ్యం, పరిమితులు తెలియడమే కాదు.. అవసరం అయినప్పుడు కొన్ని అక్కర్లేని పనులను పక్కనపెట్టడం కూడా తెలుస్తుంది.

చదువు, ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్, కెరియర్‌కు సంబంధించిన పనులు.. విద్యార్థి జీవితంలో అన్నీ ఉంటాయి, ప్రతి విషయానికీ దేని విలువ దానికే ఉంటుంది. ఒక్కొక్కరి అవసరాలు వేరువేరుగా ఉన్నప్పుడు వీటికి ఇవ్వాల్సిన ప్రాముఖ్యం కూడా వేరుగానే ఉంటుంది కదా!

అందుకే రోజువారీ పనుల్లో ప్రాధమ్యాలు (ప్రయారిటీస్) ఎంచుకోవడం అవసరం. ఎందుకంటే సబ్జెక్టులు, టెస్టులు, గ్రేడ్లు, కెరియర్ అంటూ విద్యార్థులకు ఉండే ఒత్తిడి చిన్నదేం కాదు.. ఎంత చేసినా రోజు సరిపోదన్నంత బిజీగా ఉంటుంది. ఇలాంటి సమయంలో ఏది ముందు.. ఏది తర్వాత అనేది సరిగా ఎంచుకుంటే అన్నింటినీ చక్కగా నిర్వహించగలుగుతాం. ఇందుకు పాటించాల్సిన సూచనలేంటో చూద్దామా!

సమయం అంచనా

ప్రతి పనికీ నిర్దిష్టమైన సమయాన్ని కేటాయించుకోవడం ద్వారా దేన్ని ఎంత కాలవ్యవధిలో పూర్తి చేయగలమో ఒక స్పష్టత ఏర్పడుతుంది. అలాగే షెడ్యూల్‌పై పట్టు లభిస్తుంది. దీనివల్ల నిర్దేశించిన సమయంలో ఎన్ని పనులు సమర్థంగా పూర్తిచేయగలుగుతున్నామో తెలుస్తుంది. వాయిదాలు వేస్తూ సమయం వృథా కాకుండా ఈ పద్ధతి ఆపుతుంది.

పనుల జాబితా

ఒక రోజులో ఉన్న పనులు, ఒక నెలలో చేయాల్సిన మార్పులు, ఒక ఏడాదిలో అందుకోవాల్సిన లక్ష్యాలు.. ఇలా ఏవైనా ఒక జాబితాగా రాయడం ద్వారా వాటిపై స్పష్టత ఏర్పడుతుంది. అప్పుడు వాటిలో ఏది ముందు, ఏది తర్వాత, ఏది వెంటనే, ఆపైన.. ఇలా నిర్ణయించుకోవడం సులభమవుతుంది. ఇందుకోసం ఆలోచనలు అన్నింటినీ ఒక కాగితంపై రాసుకోవాలి. చదువు, పని, ఇల్లు, స్నేహితులు.. అన్నింటినీ ఈ పద్ధతిలో సులభంగా నిర్వహించుకోగలం.

ప్రతి పనికీ దానికున్న ప్రాముఖ్యతను నిర్ణయించడం ముఖ్యం. ఆ పని ముగించాల్సిన గడువు, లేదా అది పూర్తవ్వడం కోసం చేయాల్సిన కృషి.. ముందే ఆలోచించడం ద్వారా అది ఎప్పుడు చేయాలనే విషయం నిర్ణయించుకోవచ్చు. అతి ముఖ్యమైన పనులను గడువు కంటే ముందే పూర్తిచేసేలా మన ప్రణాళిక ఉండాలి. అధికంగా సమయం, శ్రమ తీసుకోని పనులను తక్కువ ప్రాధాన్యంతో కింది వరుసలో ఉంచుకోవచ్చు. కచ్చితంగా చేయాల్సిన పనులు, చేస్తే బాగుంటుంది అనుకునేవి.. ఇలా కేటగిరీల వారీగా విభజించుకోవడం ద్వారా మరింత సమర్థంగా వాటిని పూర్తి చేయగలం.

ప్రణాళిక ఎలా?

కేటాయింపు

ముఖ్యమైన పనులేంటో, వాటికి ఎంత చొప్పున సమయం పడుతుందో అర్థం చేసుకున్నాక వాటికి సమయాన్ని కేటాయిస్తూ షెడ్యూల్ వేసుకోవాలి. దీనిద్వారా పనులు పూర్తిచేయడానికి సంబంధించిన మొత్తం ప్రణాళిక అంతా సిద్ధమవుతుంది. ఈ షెడ్యూల్‌ను రోజువారీ, నెలవారీగా సిద్ధం చేసుకోవడం ఉత్తమం. ఆఖర్లో అనుకున్నవన్నీ చేశామో లేదో పరిశీలించేలా చెక్‌లిస్ట్ ఉండాలి.

అవసరం లేనప్పుడు..

మన టు-డూ-లిస్టులో అవసరం లేని పనులను తగ్గించుకోవడం కూడా ముఖ్యమే! దీనివల్ల ఒత్తిడి తగ్గుతుంది. ఒక సమయంలో ముఖ్యమైనవిగా భావించిన పనులు తర్వాత అంత అవసరం లేకుండా పోవచ్చు. అటువంటి సమయాల్లో వాటిని తొలగించడం ద్వారా ఆ జాబితాను ఎప్పటికప్పుడు తాజాగా ఉంచుకోగలం.

ఫోకస్ తప్పకుండా..

టాస్క్‌లో ఉన్నప్పుడు అంతరాయం కలిగించే ఎటువంటి అంశాలకూ చోటు ఇవ్వకపోవడం మరో ముఖ్యమైన అంశం. కుదిరితే అలా ఇబ్బంది కలిగించే అంశాలను బ్రేక్ సమయానికి వాయిదా వేయడం, మరీ తప్పకపోతే ఆ సమయంలోనే బ్రేక్ తీసుకోవడం ద్వారా మన చదువు, ప్రణాళిక తప్పకుండా ఉంటుంది.

అనుకోకుండా వచ్చేవాటికి..

ఎంత జాగ్రత్తగా ప్లాన్ చేసుకున్నా కొన్నిసార్లు మనం అనుకున్న విధంగా పనులు జరగకపోవచ్చు. కొన్నింటికి అంచనా వేసిన దానికంటే ఎక్కువ సమయం పడితే, అనుకోకుండా వేరే పనులు కూడా వచ్చి చేరవచ్చు. కొన్ని టాస్కులు ప్రాధాన్య క్రమంలో ముందుకీ, వెనక్కీ వెళుతుండవచ్చు. ఇటువంటి అనుకోని పనులనూ సర్దుకునేలా మన షెడ్యూల్‌లో కొంత ఖాళీ సమయం ఉండాలి. దానివల్ల ప్లానింగ్ మరీ దెబ్బతినకుండా ఉంటుంది.

వాస్తవికంగా..

ప్రణాళిక, ప్రాధమ్యాలు అనగానే అందరికీ ఒకే రకమైన మూసధోరణి సరిపోదు. ఒక్కో విద్యార్థీ ప్రత్యేకంగా ఉంటారు. అందువల్ల ప్రాధమ్యాల ఎంపిక వాస్తవికంగా ఉండాలి. చేయగలిగే సామర్థ్య పరిధిలోనే పనుల ప్రణాళిక జరగాలి. రోజూ ఒకే విధంగా, ఒకే ఏకాగ్రతతో టాస్కులు పూర్తి చేయలేం అనే విషయాన్ని ఇక్కడ గమనించాలి. వాస్తవాలకు దూరంగా, ఆచరణయోగ్యం కాని ప్రాధాన్యాలు నిర్దేశించుకోవడం వల్ల వాటిని అమలు చేయలేక ఇబ్బందిపడతాం.

విరామం

ప్రాధమ్యాలను సమర్థంగా ఎంపిక చేసుకోవడం, ఆలోచించడం, అన్నివేళలా స్థిరంగా అమలు చేయడం కొంత ఒత్తిడితో కూడుకున్న విషయం. అందుకే అవసరమైనప్పుడు విరామం తప్పనిసరి. అవసరమైతే బ్రేక్స్‌కు కూడా షెడ్యూల్‌లో భాగం ఇవ్వడం ద్వారా మరింత ప్రశాంతంగా పనులను పూర్తిచేయగలుగుతాం.

అధిక ఉత్పాదకత

కొందరు విద్యార్థులు తెల్లవారుజామున చదివేందుకు ఇష్టపడతారు. కొందరు రాత్రుళ్లు ఎంత ఆలస్యమైనా మెలకువగా ఉండగలరు కానీ తెల్లవారిమాత్రం నిద్రలేవలేరు. మరికొందరు సాయంత్రాలు చాలా ప్రశాంతంగా చదువుకోగలుగుతారు. ఒక్కొక్కరికీ అత్యధిక ఉత్పాదక సమయం అంటూ ఒకటి ఉంటుంది. ఆ సమయంలో వారు గంటలో చేసే పనిని అరగంటలో పూర్తిచేయగలరు.

● ప్రాధమ్యాలను గుర్తించే క్రమంలో అత్యంత ముఖ్యమైన టాస్కులను ఇలా అధికంగా ప్రొడక్టివ్‌గా ఉండే సమయంలో చేయడం ద్వారా తక్కువ వ్యవధిలో ఎక్కువ పని చేయగలుగుతాం. ఆ సమయంలో చదివింది బాగా గుర్తుండటం, రాసిన అసైన్‌మెంట్లు మెరుగ్గా రావడం, ప్రాజెక్టులకు కొత్త ఆలోచన స్ఫురించడం.. ఇలా జరుగుతుంటుంది. అందువల్ల ప్రధాన సమయాన్ని ముఖ్యమైన టాస్కులకు కేటాయించుకోవడం మంచిది.

నోటిఫికేషన్స్

ప్రభుత్వ ఉద్యోగాలు

శానిటరీ అటెండర్ కమ్ వాచ్‌మెన్ పోస్టులు

ఒంగోలులోని జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయం- ప్రకాశం జిల్లాలోని పీహెచ్‌సీల్లో అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన 10 పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

● ఫిమేల్ నర్సింగ్ ఆర్డర్లీ: 03 ● శానిటరీ అటెండర్ కమ్ వాచ్‌మెన్: 07

అర్హత: పదో తరగతి. **వయసు:** 42 సంవత్సరాలు మించకూడదు. **వేతనం:** రూ.15,000. **దరఖాస్తు:** ఆఫ్‌లైన్ దరఖాస్తులను ఒంగోలులోని జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయానికి పంపాలి. **ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 22.12.2023. **వెబ్‌సైట్:** https://prakasam.ap.gov.in/notice_category/recruitment/

నంద్యాల జిల్లాలో ఆఫీస్ స్టాఫ్

నంద్యాల జిల్లా సాంకేతిక విద్యా శాఖ- అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన బేతంచెర్లలోని ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో 13 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టులు: ల్యాబ్ అటెండర్, ఆఫీస్ సబార్డినేట్, వాచ్‌మెన్, స్వీపర్, టెక్నికల్ ఎలక్ట్రీషియన్ తదితరాలు. **అర్హత:** పోస్టును అనుసరించి 5, 7, 10వ తరగతి, ఐటీఐ. **వయసు:** 42 సంవత్సరాలు మించకూడదు. **దరఖాస్తు:** ఆఫ్‌లైన్ దరఖాస్తులను ప్రభుత్వ పాలిటెక్నిక్, బేతంచెర్ల, నంద్యాల జిల్లా చిరునామాకు పంపించాలి. **దరఖాస్తుకు చివరి తేదీ:** 26-12-2023. **వెబ్‌సైట్:** https://nandyal.ap.gov.in/

ఎన్‌టీఆర్‌ఓలో సైంటిస్ట్‌లు

న్యూఢిల్లీలోని నేషనల్ టెక్నికల్ రిసెర్చ్ ఆర్గనైజేషన్- 74 సైంటిస్ట్ 'బి' పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

విభాగాలు: ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, కంప్యూటర్ సైన్స్, జియో-ఇన్ఫర్మాటిక్స్ అండ్ రిమోట్ సెన్సింగ్.

అర్హత: సంబంధిత విభాగంలో మాస్టర్ డిగ్రీతో పాటు గేట్ స్కోరు. **వేతనం:** నెలకు రూ.56,100 నుంచి రూ.1,77,500. **వయసు:** 30 ఏళ్లు మించకూడదు. **ఎంపిక:** గేట్ స్కోరు, రాత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా. **దరఖాస్తు ఫీజు:** రూ.250. ఎస్సీ/ఎస్టీ/మహిళా అభ్యర్థులకు ఫీజు మినహాయింపు. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 19-01-2024. **వెబ్‌సైట్:** https://recruit-ndl.nielit.gov.in/

ప్రవేశాలు

ఐఐఎం కొజికోడ్‌లో పీహెచ్‌డీ

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ కొజికోడ్- 2024 విద్యా సంవత్సరానికి పీహెచ్‌డీ ప్రోగ్రాంలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

స్పెషలైజేషన్లు: ఎకనామిక్స్, ఫైనాన్స్, అకౌంటింగ్ అండ్ కంట్రోల్, హ్యూమానిటీస్ అండ్ లిబరల్ ఆర్ట్స్ ఇన్ మేనేజ్‌మెంట్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హ్యూమన్ రిసోర్సెస్, క్వాంటిటేటివ్ మెథడ్స్ అండ్ ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్. **అర్హత:** డిగ్రీ, పీజీ లేదా సీఏ, ఐసీడబ్ల్యూఏ, సీఎస్. **దరఖాస్తు రుసుము:** రూ.1000 **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 31-01-2024 **ఇంటర్వ్యూ తేదీలు:** 2024, ఏప్రిల్ 17 నుంచి 21 వరకు. **వెబ్‌సైట్:** https://iimk.ac.in/academic-programmes/Fellow-Programme-in-Management

తాజా ఇంటర్న్‌షిప్‌లు

హైదరాబాద్‌లో

టాలెంట్ అక్విజిషన్

సంస్థ: జీగ్లర్ ఏరోస్పేస్
స్టైపెండ్: నెలకు రూ.10,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 26
అర్హతలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, హెచ్‌ఆర్ఐఎస్, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-ఆఫీస్, ఎంఎస్-వర్డ్, రిక్రూట్‌మెంట్ నైపుణ్యాలు
☛ internshala.com/i/63cec4

గ్రాఫిక్ డిజైన్

సంస్థ: డీప్‌థాట్ ఎడ్యుటెక్ వెంచర్స్
స్టైపెండ్: నెలకు రూ.6,000-8,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 25
అర్హతలు: అడోబ్ ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, ప్రీమియర్ ప్రో, వీడియో ఎడిటింగ్ నైపుణ్యాలు
☛ internshala.com/i/91cb1a

కార్పొరేట్ సేల్స్

సంస్థ: ఇన్‌క్రా సాఫ్ట్
స్టైపెండ్: నెలకు రూ.8,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 28
అర్హతలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్, హిందీ మాట్లాడటం, సేల్స్ పిచ్ నైపుణ్యాలు
☛ internshala.com/i/c031ee

మార్కెటింగ్

సంస్థ: ఏక్‌లవ్య
స్టైపెండ్: నెలకు రూ.25,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 27
అర్హతలు: డిజిటల్ ఎడ్వర్టైజింగ్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-ఎక్సెల్ నైపుణ్యాలు
☛ internshala.com/i/64ae8e

సేల్స్ అండ్ మార్కెటింగ్

సంస్థ: హైరింగ్‌హుడ్
స్టైపెండ్: నెలకు రూ.10,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 28
అర్హతలు: సీఆర్ఎం, ఎంఎస్-ఆఫీస్ నైపుణ్యాలు
☛ internshala.com/i/28f667

హ్యూమన్ రిసోర్సెస్

సంస్థ: ఎంబెడ్‌టెక్ సొల్యూషన్స్
స్టైపెండ్: నెలకు రూ.7,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 28
అర్హతలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, హెచ్‌ఆర్ అనలిటిక్స్, ఎంఎస్-ఆఫీస్ నైపుణ్యాలు
☛ internshala.com/i/11f70e

సోషల్ మీడియా మార్కెటింగ్

సంస్థ: వాటే వావ్ మార్కెటింగ్
స్టైపెండ్: నెలకు రూ.5,000-10,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 28
అర్హతలు: అడోబ్ ఫొటోషాప్, ప్రీమియర్ ప్రో, క్రియేటివ్ రైటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటంలో నైపుణ్యం
☛ internshala.com/i/370dce

వైజాగ్, హైదరాబాద్, విజయవాడ, గుంటూరులలో

రిక్రూట్‌మెంట్

సంస్థ: సింప్లిఫై సొల్యూషన్స్
స్టైపెండ్: నెలకు రూ.5,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 24
అర్హతలు: ఎంఎస్-ఎక్సెల్, ఇంగ్లిష్ రాయడం, మాట్లాడటంలో నైపుణ్యం
☛ internshala.com/i/38b83f

యునైటెడ్ ఇండియాలో 300 కొలువులు

యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ (యూఐఐసీ) 300 అసిస్టెంట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీచేసింది. డిగ్రీ పాసైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ రాత పరీక్ష, రీజనల్ లాంగ్వేజ్ టెస్టుల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు

ఆంధ్రప్రదేశ్‌లో
చీరాల, శ్రీకాకుళం, గుంటూరు, కడప, కర్నూలు, నెల్లూరు, రాజమహేంద్రవరం, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, కాకినాడ, చిత్తూరు, ఏలూరు, విజయనగరం

తెలంగాణలో
హైదరాబాద్/రంగారెడ్డి, కరీంనగర్, వరంగల్, ఖమ్మం



మొత్తం 300 ఉద్యోగాల్లో అన్-రిజర్వుడ్‌కు 159, ఎస్సీలకు 30, ఎస్టీలకు 26, ఓబీసీలకు 55, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 30 కేటాయించారు. 30.09.2023 నాటికి ఏదైనా డిగ్రీ పాసైనవారు దరఖాస్తుకు అర్హులు. అభ్యర్థులకు దరఖాస్తు చేస్తున్న రాష్ట్రానికి చెందిన ప్రాంతీయ భాష చదవడం, రాయడం, మాట్లాడటం తెలిసుండాలి.

ఆంధ్రప్రదేశ్‌కు 8, తెలంగాణకు 3 పోస్టులే కేటాయించినప్పటికీ... హిందీ రాయడం, చదవడం, మాట్లాడటం తెలిసిన అభ్యర్థులు ప్రాంతీయ భాషగా హిందీ ఉన్న రాష్ట్రాల్లోని ఉద్యోగాలకు పోటీపడవచ్చు.

అభ్యర్థుల వయసు 30.09.2023 నాటికి 21 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉండాలి. గరిష్ఠ వయసులో.. ఎస్సీ, ఎస్టీలకు 5 ఏళ్లు, ఓబీసీలకు 3 ఏళ్లు, ఎక్స్-సర్వీస్‌మెన్‌కు 3 ఏళ్లు, పీడబ్ల్యూబీడీలకు 10 ఏళ్లు, యుఐఐసీ ఉద్యోగులకు 5 ఏళ్ల మినహాయింపు ఉంటుంది.

దరఖాస్తు ఫీజు ఎస్సీ/ఎస్టీ/ పీడబ్ల్యూబీడీ, యూఐఐసీ ఉద్యోగులకు రూ.250 + జీఎస్టీ అదనం. ఇతరులకు రూ.1000 + జీఎస్టీ అదనం. ఎంపికైన అభ్యర్థులకు 6 నెలల ప్రొబేషన్ ఉంటుంది. సంస్థ అంచనాలను అభ్యర్థులు అందుకోలేకపోతే.. ప్రొబేషన్ కాలాన్ని పెంచుతారు.

ఎంపిక: ఆన్‌లైన్ రాత పరీక్ష, రీజనల్ లాంగ్వేజ్ టెస్ట్‌ల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీ భాషల్లో.. మల్టిపుల్ ఛాయిస్ విధానంలో ఉంటుంది. ప్రశ్నపత్రంలో 5 సెక్షన్లు ఉంటాయి.

1. రీజనింగ్ - 40 ప్రశ్నలు, 50 మార్కులు
2. ఇంగ్లిష్ లాంగ్వేజ్ - 40 ప్రశ్నలు, 50 మార్కులు
3. న్యూమరికల్ ఎబిలిటీ - 40 ప్రశ్నలు, 50 మార్కులు
4. జనరల్ నాలెడ్జ్/ జనరల్ అవేర్‌నెస్ - 40 ప్రశ్నలు, 50 మార్కులు
5. కంప్యూటర్ నాలెడ్జ్ - 40 ప్రశ్నలు, 50 మార్కులు

● మొత్తం 200 ప్రశ్నలకు 250 మార్కులు ఉంటాయి.
● ప్రతి తప్పు సమాధానానికీ పావు మార్కు తగ్గిస్తారు.
● పరీక్ష వ్యవధి 120 నిమిషాలు (2 గంటలు).

రాత పరీక్ష పాసై, రీజనల్ లాంగ్వేజ్ టెస్ట్‌లో అర్హత సాధించిన అభ్యర్థుల తుది జాబితాను రూపొందించి .. వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. వీటన్నింటిలో పాసైన అభ్యర్థులను ఎంపికచేసి.. ఈ సమాచారాన్ని వెబ్‌సైట్ ద్వారా తెలియజేస్తారు.

సన్నద్ధత

● రీజనింగ్, ఇంగ్లిష్ లాంగ్వేజ్, న్యూమరికల్ ఎబిలిటీ, జనరల్ నాలెడ్జ్/ జనరల్ అవేర్‌నెస్, కంప్యూటర్ నాలెడ్జ్... వీటి సన్నద్ధత కోసం ఐబీపీఎస్, ఎస్ఎస్‌సీ, రైల్వే పోటీ పరీక్షల పాత ప్రశ్నపత్రాలను సాధన చేయొచ్చు.
● సమాధానాలను కచ్చితంగా, నిర్ణీత సమయంలోనే రాయగలగాలి.
● నెగిటివ్ మార్కులు ఉన్నాయి. కాబట్టి తెలిసిన ప్రశ్నలకు మాత్రమే సమాధానాలను గుర్తించాలి. తెలియనివాటిని వదిలివేయడమే మంచిది.
● ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండే మాక్‌టెస్ట్‌లను రాయడం వల్ల కూడా ఫలితం ఉంటుంది. బలాలు, బలహీనతలను సమీక్షించుకుని.. వెనకబడిన అంశాల సాధనకు అదనపు సమయాన్ని కేటాయించుకునే వీలుంటుంది.
● బ్యాంకు పరీక్షలకు సంబంధించి మార్కెట్లో అందుబాటులో ఉన్న పుస్తకాలనూ చదవొచ్చు.

గమనించాల్సినవి

● ఆన్‌లైన్ అప్లికేషన్ ప్రింటవుట్‌ను అభ్యర్థులు భద్రపరుచుకోవాలి.
● కాల్ లెటర్ ద్వారా పరీక్ష కేంద్రం వివరాలను తెలియజేస్తారు. దీన్ని వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఈ సమాచారాన్ని ఈమెయిల్/ ఎస్ఎంఎస్ ద్వారా అభ్యర్థులకు తెలియజేస్తారు.
● దరఖాస్తు సమయంలోనే పరీక్ష కేంద్రాన్ని ఎంపిక చేసుకోవాలి. ఆ తర్వాత దీంట్లో ఎలాంటి మార్పులకూ అవకాశం ఉండదు.

దరఖాస్తుకు చివరి తేదీ: 06.01.2024
వెబ్‌సైట్: http://www.uiic.co.in/